క్లుప్తంగా

దెందులూరు ఇన్‌చార్జి ఏఈగా పి.శ్రీనివాసరావు

దెందులూరు: దెందులూరు మండలం విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జిగా పీ.శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ గురువారం లిఖితపూర్వ ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావు ప్రస్తుతం దెందులూరు సబ్‌స్టేషన్‌లో సబ్–ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

ఉత్తమ సమాజస్థాపనే మానవత లక్ష్యం



నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న మండల మానవత ప్రతినిధులు

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపన లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని మానవత మండల ప్రతినిధులు గుల్ల నూకరాజు, పంచకర్త సత్యనారాయణలు అన్నారు. భీమడోలు గ్రామంలో ఇటీవల క్యాన్సర్ వ్యాధి బారిన పడిన గండి కృష్ణ కుటుంబానికి, సూరప్పగూడెంలో కాలి విరిగిన పంతుల రాముడునికి గురువారం మండల మానవత మండల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు, ఆర్థిక సాయం చేసి తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పెద్దలు పున్నం గోపి, వెజ్జు కొండలరావు, చిలపర్తి ఆదినారాయణ, అల్లాడ ప్రసాదరావు, గోనుగుంట రమణశంకర్, కిలపర్తి రుగ్మాంగధరరావు తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో ఆర్టీసీ సీజన్ పాస్‌ల జారీ రద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో పరిధిలో సీజన్ పాసులు, విద్యార్థుల బస్సు పాసుల జారీని ఈ నెల 5, 6 తేదీల్లో రద్దు చేస్తున్నట్టు ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కారణంగా పాసుల జారీని నిలుపుదల చేస్తామని, ఈ నెల 7వ తేదీ నుంచి యధావిధిగా పాసులు జారీ చేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: బుట్టాయగూడెం ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడానికి చెందిన బి.గాంధీ (46) కడుపునొప్పితో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన అతను గత నెల 30న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నూతన మద్యం పాలసీ సవరణ కోరుతూ వినతి



వినతి పత్రం అందిస్తున్న ఐద్వా నాయకులు

ఏలూరు (టూటౌన్): నూతన మద్యం పాలసీని సవరించాలని, నివాస ప్రాంతాల వద్ద మద్యం షాపులు పెట్టొద్దని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ ఇప్పటికే మద్యం వల్ల మహిళలు, చిన్న పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏలూరులోనే పనికోసం వచ్చిన ఒక మహిళపై భర్త ఉండగానే ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని, ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా.. మళ్లీ నూతన మద్యం పాలసీ పెట్టి ప్రైవేట్ వారికి అప్పజెప్పడం వల్ల పేదల కుటుంబాలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం ఆధీనంలోనే మద్యం షాపులను నడపాలని, షాపుల సమయం కుదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.శారద, సీహెచ్ రాజ్యలక్ష్మి, ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల విషయంలో హామీని నిలబెట్టుకోవాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని ప్రజలకు, రైతులకు ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి పార్టీలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఇతర భారాలు తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు 2022–23 సంవత్సరానికి సుమారు రూ.8,114 కోట్లు భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సీ) నోటిఫికేషన్ జారీ చేసిందని ఆరోపించారు. 2023–24కు సంబంధించి మరో రూ.11 వేల కోట్లు పైగా సర్దుబాటు చార్జీల భారం మోపబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

- తొలివిడతలో రూ.1.05 కోట్లు నిధులు విడుదల చేసిన జగన్ సర్కార్
- రెండో విడత రావల్సిన నిధులు నిలిపేసిన కూటమి సర్కార్



అసంపూర్తిగా ఉన్న జల్లికొమ్మర అంగన్‌వాడీ భవన నిర్మాణం



ఆగిపోయిన బువ్వనపల్లి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు

నిడమర్రు: గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు చిన్నారుల బడులైన అంగన్‌వాడీ కేంద్ర భవనాలుకు సైతం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ఫేజ్–2లో 14 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు గత ప్రభుత్వంలో నాడు– నేడు పథకంలో ప్రారంభించారు. వీటి నిర్మాణాలకు అవసరమైన నిధుల్లో తొలివిడతగా ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ.7.5లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో అప్పట్లో వీటి నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. మలివిడత నిధులు మంజూరుకి అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో నిధులు విడుదల నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం అధికారం చేపట్టిన కూటమి సర్కారు మిగిలిన రెండో విడత నిధులు మంజూరు నిలిపివేయడంతో అవి ప్రస్తుతం గ్రామాల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. తొలివిడత నిధులతో బేస్‌మెంట్, స్లాబ్, గోడలు పూర్తి చేసుకోగా ప్లాస్టింగ్, కిటికీలు, తలుపుల వంటి పనులకు ఆగిపోయాయి.

నిర్మాణాలు ఇలా..

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉండాలనే లక్ష్యంతో ఫేజ్–2 నాడు–నేడు పథకంలో కొత్తగా అంగన్‌వాడీ భవనాలను నాటి సర్కారు మంజూరు చేసింది. నిడమర్రు మండలంలో నిడమర్రు,పెందనింద్రకొలను, మందలపర్రు, క్రొవ్విడి ఉప్పరగుడెం ఆంగన్వాడీ కేంద్రాలకు, ఉంగుటూరు మండలంలో ఎ.గోపవరం–2, బాదంపూడి అంగన్‌వాడీ కేంద్రాలకు గణపవరంలో జల్లికొమ్మర, సీహెచ్ అగ్రహారం, సరిపల్లి, గణపవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు. భీమడోలు మండలంలో 4 అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు నిర్మించేలా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం వాటి పరిస్థితి అసంపూర్తిగా ఉన్నాయి.

పారదర్శకంగా నిధులు వినియోగం

ఈ అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణంలో ప్రైవేటు కాంట్రాక్టర్లు, ఇత ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా నాడు–నేడు పథకంలో నాడు– నేడు కమిటీ పేరుతో ఈ పనులు చేపట్టారు. ఈ కమిటీలో ఆయా పరిధిలోని తల్లులను భాగస్వామ్యం చేస్తూ తల్లుల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ , వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉంటారు. వీరి ఆధ్వర్యంలో ఈ భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ నాడు–నేడు ఖతాలు రెండో విడత నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రస్తుతం అవి అద్దె భవనాల్లో, పాత పంచాయితీ భవనాల్లో, కమ్యూనిటీ సెంటర్లలలో పాత గదుల్లో కొనసాగుతున్నాయి. ఇరుకుగా అరకొర వసతులున్న ఆ భవనాలు చిన్నారులను ఆడించాలన్నా, వారికి భోజనం వండి వడ్డించాలన్నా, చదువు చెప్పాలన్నా ఇబ్బందిగా మారిందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

పేరును మార్చి ఏమార్చి..

మన బడి నాడు–నేడు పేరును చంద్రబాబు సర్కార్ పేరును రెండు నెలల్లో రెండుసార్లు మార్పు చేసింది. ఆ పథకాన్ని తొలూత స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ (ఎస్ఐఐ)గా అమలు చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించారు. దాన్ని ఇటీవల ఆ పేరు స్థానంలో మనబడి–మన భవిష్యత్ పేరుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పథకాల పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లో కూడా ఉండాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో నాడు–నేడు కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



నాడు–నేడు పథకం ఫేజ్–2లో నిధులు విడుదలై ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలి. అవసరమైన నిధులు త్వరిత గతిన విడుదల చేయాలి. అద్దెభవనాల్లో, పాత పంచాయతీ భవనాల్లో విద్యార్థులు, సిబ్బందికి మోక్షం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే.

– కోడే కాశి, జెడ్పీటీసీ సభ్యుడు, నిడమర్రు

పోటీలకు పయనమైన విద్యార్థులు

దెందులూరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీలకు దెందులూరు మండలం పోతునూరు ఉన్నత పాఠశాల విద్యార్థి తాతినేని కుందన కౌశిక్ ఎంపికయ్యారు. గురువారం68 వ అండర్– 14 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలో పాల్గొనేందుకు ఎన్టీఆర్ జిల్లా నున్నకు ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావుతో కలిసి వెళ్లారు.అదే విధంగా మేధినరావు పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్–17 విభాగంలో బి.రత్న బాలాజీ 71 కేజీలు విభాగం, బి హిమవంశీకృష్ణ 110 కేజీల విభాగంలో అండర్– 14 విభాగంలో వి. సాయి చందు 38 కేజీలు విభాగం ఫ్రీ స్టైల్ పాల్గొనేందుకు కృష్ణా జిల్లా నున్న ఉన్నత పాఠశాలకు ఫిజికల్ డైరెక్టర్ ఎల్వీడి రవిబాబుతో కలిసి వెళ్లారు.

స్టీల్‌ప్లాంట్ జోలికి వస్తే తడాఖా చూపిస్తాం

దెందులూరు: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని స్టీల్ ప్లాంట్ జోలికొస్తే ఏ ప్రభుత్వానికి అయినా అవి ఆఖరి రోజులని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏలూరు టౌన్ అధ్యక్షులు కాకర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులు స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగుల భద్రత తొలి ప్రాధాన్యత, కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నాయకులు

దెందులూరు: ధైర్యంగా ఉండండి మీ కుటుంబానికి అండగా ఉంటా కేసులకు భయపడవద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలానవకాంతం తాడేపల్లి మాజీ సీఎం జగన్ నివాసంలో ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి వైఎస్ జగన్‌ను కలిశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు లీలానవకాంతం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జోగన్నపాలెంలో తన మామను దాడి చేసి గాయపరిచారని తాము ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో మమ్మల్ని కొట్టడానికి 30 మంది వచ్చారని తన భర్త గంగరాజుపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేశారని వివరించారు. మీరు ధైర్యంగా ఉండండి మీ కుటుంబానికి అండగా ఉంటానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలానవకాంతం ఆమె భర్త వైఎస్సార్‌సీపీ మండల నేత గంగరాజు అన్నారు. తొలుత ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్‌తో నియోజవర్గంలో పార్టీ పరిస్థితి ఇతర అంశాలపై వైఎస్ జగన్‌తో మాట్లాడారు.

ఏలూరు రూరల్ ఎంపీడీఓగా శ్రీలత

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల ఎంపీడీఓగా ఎ.శ్రీలత నియమితులయ్యారు. ఈ నెల 7వ తేదీన ఆమె విధుల్లో చేరనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన బి.ప్రణవి విజయవాడకు బదిలీ కావడంతో గురువారం రిలీవయ్యారు. ఏలూరు రూరల్ మండలంలో ఐదేళ్ల పాటు పనిచేసిన పలువురు అధికారులకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీ స్థానంలో ఎం సరళకుమారి ఉంగుటూరు నియోజకవర్గానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వేరొకరని నియమించాల్సి ఉంది. పీఆర్ఏఈ కృష్ణప్రసాద్ స్థానంలో బీవీ శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు మొండికోడు, కోటేశ్వరదుర్గాపురం, కొక్కిరాయిలంక, కోమటిలంక, కాట్లంపూడి, కలకుర్రు పంచాయతీలకు సచివాలయ కార్యదర్శులకు ప్రమోషన్ ఇచ్చి, గ్రేడ్–5 కార్యదర్శులుగా ప్రభుత్వం నియమించింది.

కూటమి పాలనలో చిరుద్యోగులకు భద్రత కరువు



గుండుగొలనులో పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

భీమడోలు: కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులకు భద్రత కరువైందని ఆశావర్కర్ల యూనియన్ నేతలు పద్మ, నయోమి, ఉదయమణిలు అన్నారు. టి.నరసాపురం పీహెచ్‌సీలోని ఆశా వర్కర్ కె.లక్ష్మీ మంగను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్ల యూనియన్ జిల్లాసంఘం పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మానవహారం చేస్తూ ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. ఆశావర్కర్‌ను అధికార పార్టీలోని ఒక వర్గం వారు ఒత్తిడి చేసి వైద్యాధికారి ద్వారా జిల్లా అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి అన్యాయంగా తొలగించారంటూ ఆందోళన చేశారు. అధికార పార్టీలోని కొందరు చిరుద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేసి తొలగించిన ఆశావర్కర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం చేస్తామని వారు. తెలిపారు.

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



వివిధ పోటీలలో విజేతలతో ప్రిన్సిపల్ అధ్యాపకులు

గణపవరం: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా వివిధ అంశాల్లో క్విజ్, డిబేట్, వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వం తదితర పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన 36 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నిర్మలకుమారి మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర–2047పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటరమణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



చంద్రబోసు

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై గురువారం గ్రామానికి చెందిన తుమ్మపాల సుభాష్‌చంద్రబోసు(40)మరణించాడు. ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పాత కోట్లమ్మ ఆలయ శుభ్రం చేసే క్రమంలో అక్కడన్న మోటారు వేసేటప్పుడు చంద్రబోస్ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లలిత, ఇద్దరు అబ్బాయిలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ తెలిపారు.

ఊరూవాడా దసరా సందడి



ఉంగుటూరు: శివాలయంలో కనకదుర్గమ్మ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



పెదపాడువట్టూరు ప్రత్యేకాలంకరణలో అంబికాదేవి



భీమడోలు: గుండుగొలనులోని శివాలయంలో ఆకట్టుకుంటున్న వెండి చీర అలంకరణ



నిడమర్రు: పెదనింద్రకొలను రామాలయంలో బాల త్రిపుర సుందరి అవతారం



గణపవరం: మోటార్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేసిన ఉత్సవ మండపం

భీమడోలు: జగజ్జనని దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా కొలువుతీరిన ఉత్సవ పందిళ్ల వద్దకు అమ్మవారికి మంగళవాయిద్యాలతో ట్రాక్టర్లపై అమ్మవారి విగ్రహాలను ఊరేస్తూ తీసుకొచ్చారు. అమ్మవారి వాహనాల వద్ద భక్తులు, మహిళలు స్వాగత పూజలు చేసారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం, నరెడ్లగూడెం తదితర గ్రామాల్లో కోర్కెలు తీర్చే అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. గుండుగొలను గ్రామంలోని గణేష్ నగర్, వంతెన వద్ద, రామాలయం, బీసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. గణేష్ నగర్ వద్ద అమ్మవారి అలంకారంతో వేసిన సెట్ ఆకట్టుకుంది. గుండుగొలనులోని శ్రీభ్రమారాంబికా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు వెండి చీర అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గుండుగొలనులో శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఘనంగా పూజలు ప్రారంభమయ్యాయి. గుండుగొలను బీసీకాలనీలో 108 కలశాలతో అమ్మవారికి పూజలు చేశారు. భీమడోలులోని ఈతకోట వారి ఏరియాలో నిర్వాహకులు అమ్మవారి విగ్రహాన్ని పూళ్ల నుంచి ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ ఉత్సవ పందిళ్ల వద్దకు తీసుకుని వచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున స్వాగత పూజలతో పాటు బిందెలతో నీళ్లు పోశారు. భీమడోలు రావిచెట్టు సెంటర్‌లో దసరా ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

దెందులూరులో..

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు తోట రామకృష్ణ కమిటీసభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

గణపవరంలో..

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపవరంలో మోటార్‌వర్కర్స్ యూనియన్, కంచికామాక్షి అమ్మవారి ఆలయం, చినరామచంద్రపురంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం, ధనలక్ష్మి అమ్మవారి ఆలయం, తోట, సలాదివారి వీధి, సరిపల్లె, పిప్పర, కేశవరం, మొయ్యేరు, ముప్పర్తిపాడు, చిలకంపాడు, కాశిపాడు, ఏగోపవరం,అర్ధవరం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

నిడమర్రులో..

నిడమర్రు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం మండలంలోని గ్రామ గ్రామాన వైభంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో ప్రతిష్టించిన దుర్గా దేవిని బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9గంటల తర్వాత నుండి అమ్మవారి విగ్రహ మండపాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. బువ్వనపల్లిలోని చక్రధారిణి ఆలయంలో పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. నిడమర్రు దుర్గామాత ఆలయంలో ఏర్పాటు చేసిన బాలత్రిపుర సుందరి అవతారాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయితన క్షేత్రంలో అమ్మవారిని స్వర్ణ కవచ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలో గురువారం దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం,చేబ్రోలు, బాదంపూడి , వంటి ప్రధాన గ్రామాలలో నవరాత్రి సందడి ప్రారంభమైంది. ఉంగుటూరు శివాలయం ,చల్లాలమ్మ ఆలయం, కాపుల రామాలయం వద్ద, తూర్పుకాపుల రామాలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భీమేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణం హనుమంతురావు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఏర్పాట్లుచేశారు. అలాగే ఉంగుటూ గ్రామదేవత చల్లాలమ్మ ఆలయంలో దేవిన వరాత్రి పూజలను ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు.

పెదపాడులో..

పెదపాడు: మండలంలో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెదపాడు బళ్లరేవు తూము సెంటర్‌లోను, వట్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోను పెదపాడు శివారు గండిచెరువు గట్టులోను, రామచంద్రపురంలో రామాలయం వద్ద, రెళ్ల రమణ నివాసం వద్ద అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. వట్లూరులోని అంబికాదేవి ఆలయంలో బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయవద్దని నిరసన దీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) : విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అంటూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఏలూరులో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. స్థానిక వసంత మహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయవద్దు అంటూ రైతు, వ్యవసాయ, కార్మిక, కౌలు రైతు, చేతి వృత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకారులు కదం తొక్కారు. విశాఖ ఉక్క పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహనరావు, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎన్నో త్యాగాలు ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం కారు చౌకగా అమ్మేసే చర్యలు చేపట్టడం దుర్మాదర్గమని అన్నారు. దీనికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ఆంధ్రుల హక్కు అని అన్నారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని తెలిపారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోరాడితేనే విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోగలమన్నారు. భూములిచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేప్రయత్నాలు ఆపకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో చలసాని వెంకట రామారావు, రెడ్డి శ్రీనివాస డాంగే, ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.